

కోటె సరస్సు ట్రాక్‌పై వాకింగ్ చేస్తున్న స్పీకర్ యుటీ ఖాదర్

ఆరోగ్యానికి ప్రాధాన్యం: స్పీకర్

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని శాసనసభ స్పీకర్ యుటీ ఖాదర్ అన్నారు. బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాల వేళ బుధవారం ఉదయం సమీపంలోని కోటె సరస్సు చుట్టూ ఉన్న ట్రాక్‌పై వాకింగ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అవకాశం ఉన్నప్పుడల్లా కొంత సమయం వాకింగ్‌కు కేటాయిస్తానన్నారు.

తమ్మయ్య తిమ్మయ్య అయితే పర్లేదు

● నాకు లింగమే మార్చేస్తున్నారు: మంత్రి ప్రియాంకఖర్గే

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ్మయ్య కాస్త తిమ్మయ్య అయితే పర్లేదు కానీ ఏకంగా నాకు లింగమే మార్చేస్తున్నారంటూ మంత్రి ప్రియాంకఖర్గే విచారం వ్యక్తం చేశారు. బుధవారం ప్రశ్నోత్తరాల వేళ స్పీకర్ యుటీ ఖాదర్ ప్రశ్న వినిపించాలంటే సభ్యుడు తమ్మయ్య హెచ్‌డీని సూచించారు. స్పీకర్ పలకడంలోనే తమ్మయ్యకు బదులుగా తిమ్మయ్య అంటూ సంబోధించారు. అందుకు సభ్యుడు స్పందిస్తూ నాపేరు తమ్మయ్య కాగా మీరు తిమ్మయ్య అంటున్నారని, ఇలా సభలో నాపేరు మార్చేయడం సమంజసం కాదన్నారు. స్పందించిన స్పీకర్ ఎవరి పేరు మార్చకూడదని మీ పేరు తమ్మయ్య అంటూ సర్దుబాటు చేశారు. అంతలోనే మంత్రి ప్రియాంకఖర్గే జోక్యం చేసుకుని సభ్యుడి పేరు తమ్మయ్య లేదా తిమ్మయ్య అయినా పర్వాలేదని, కానీ నాకు లింగమే మార్చేస్తున్నారన్నారు. ప్రియాంకఖర్గేగా ఉండే నా పేరును సంబోధించే సందర్భంలో పలువురు ప్రియాంకా అంటూ పిలుస్తున్నారని దీనిని ఏమని అర్థం చేసుకోవాలని విచారం వ్యక్తం చేశారు.



శాసనసభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత అశోక్

ఉత్తర వెనుకబాటుపై..

● రెండు రోజులపాటు సుదీర్ఘ చర్చ

అట్టుడికిన అసెంబ్లీ

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బెళగావిలో సువర్ణసౌధ ఏర్పాటుకు ప్రధాన కారణమైన రాష్ట్ర విభజన డిమాండ్, వెనుకబడిన ప్రాంతానికి దశాబ్దాలుగా ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమ చూపడమే కారణం. బెళగావి సువర్ణసౌధలో జరుగుతున్న శాసనసభ శీతాకాల సమావేశాలలో దాదాపు రెండురోజులపాటు ఉత్తర కర్ణాటక తీవ్రమైన సమస్యలపై సుదీర్ఘచర్చ జరిగింది. బుధవారం ప్రశ్నోత్తరాల తర్వాత ప్రతిపక్షనేత అశోక్ ప్రస్తావించారు. ఉత్తర కర్ణాటక రైతులకు అన్యాయం జరుగుతోందని, పంటనష్టం, వరద పరిహారంపైనా శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర కర్ణాటక సమస్యల పరిష్కారానికి సరైన నాయకత్వం అవసరం ఉందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. ఉత్తర కర్ణాటకకు సంబంధించి రెండున్నరేళ్లలో ఏ సమస్యలు పరిష్కరించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయితే రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ, ప్రతిపక్షనేత వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపారు. రాష్ట్రంలో వరదనష్టానికి సంబంధించి పరిహారం చెల్లించామని, కానీ ప్రతిపక్షనేత అబద్ధాలు చెబుతున్నారన్నారు. 2013 నుంచి 2016దాకా వరుసగా మూడేళ్లు పరిహారం ఇచ్చామని, 2019 నుంచి 2023 వరకు వరదలతో నష్టపోయిన రైతులకు సమగ్రంగా పరిహారం చెల్లించామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం ఇంటి నష్టానికి రూ.95వేలు ఇచ్చామన్నారు.

● అశోక్ మాట్లాడుతూ 2014 నుంచి 2022 వరకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రూ.11,603 కోట్లు పరిహారం ఇచ్చిందని, కానీ మన్మోహన్‌సింగ్ పాలనలో కేవలం రూ.3,233 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఇటీవల భారీ వరదలతో నష్టం జరిగిందని కలబురగి, బీదర్, విజయపుర, యాదగిరి జిల్లాల్లో 117కుపైగా గ్రామాలు జలమయం కాగా 20వేల ఇళ్లు దెబ్బతిన్నాయని, 14.58 లక్షల హెక్టార్ల పంటనష్టం జరిగిందని, 2,893 పాఠశాలలు దెబ్బతిన్నాయన్నారు. మైసూరులో దసరా వేడుకలు ఆడంబరంగా చేస్తారని, కానీ ఉత్తర కర్ణాటకను మాత్రం పట్టించుకోరన్నారు. ముఖ్యమంత్రి వైమానిక పరిశీలనలు కాకుండా కారులో తిరిగి ఉంటే ప్రజల కష్టాలు తెలిసేవన్నారు. పలుమార్లు ప్రతిపక్షనేత అశోక్ వ్యాఖ్యలకు అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

● సభలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక అభివృద్ధిలో ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని, సవతితల్లి ప్రేమ చూపుతోందని మండిపడ్డారు. ఉత్తర కర్ణాటక సమస్యలంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రెండున్నరేళ్లుగా రైతుల సమస్యలపై కనీస స్థాయిలో స్పందించలేదన్నారు. తుంగభద్ర జలాశయం విషయంలో నిపుణుల సలహాలను పాటించలేదని, క్రస్ట్‌గేట్‌ల ఏర్పాటులో ఏడాదిగా వాయిదాలు వేస్తూ వస్తోందన్నారు. చెరకు రైతులు రోడ్డెక్కి ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. విజయేంద్ర వ్యాఖ్యలపై చక్కెరశాఖ మంత్రి శివానందపాటిల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. చెరకు రైతుల సమస్యలను పరిష్కరించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, గత బీజేపీ పాలనలో రైతులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తెలుసన్నారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే శివలింగేగౌడ

● ఉత్తరకర్ణాటక సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతుండగా అధికార పార్టీకి చెందిన శివలింగేగౌడ అభ్యంతరం వ్యక్తం చేశా రు. హాసన్ జిల్లాకు ఉత్తర కర్ణాటక సుదూరం లేదని, కానీ హాసన్‌లో కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిపై కూడా చర్చించాలన్నా రు. ఎక్కడ రైతులకు నష్టం జరిగినా అది కేవలం రైతు కుటుంబాలకే కాదని, సమాజానికి సరికాదన్నారు. ఉత్తర కర్ణాటక సమస్యలపై ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సభ్యులు పలు అంశాలను ప్రస్తావించారు.

గొడవలు జరగలేదు

● ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలపై హోంమంత్రి సమాధానం

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు, పథ సంచలనానికి అవకాశం ఇవ్వరాదని, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తోందని ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంకఖర్గే సహా పలువురు కాంగ్రెస్ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ప్రియాంకఖర్గే సొంత జిల్లా కలబురగి పరిధిలోని చిత్తాపురలో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి అవకాశం ఇవ్వరాదని కొందరు కోర్టును ఆశ్రయించినా చివరకు ర్యాలీ జరిగిందన్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా 518 చోట్ల ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు, పథసంచలనం జరిగాయని ఎక్కడా గొడవలు జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వమే తేల్చిచెప్పింది. బెళగావి సువర్ణసౌధలో శీతాకాల సమావేశాలలో భాగంగా బీజేపీ సభ్యుడు వి. సునిల్‌కుమార్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల గురించి ప్రశ్నించారు. ఇందుకు హోం మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ రాష్ట్రవ్యాప్తంగా 518 చోట్ల ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు, పథసంచలనాలు జరిగాయని, సుమారు 2లక్షల మందికిపైగా స్వయం సేవకులు పాల్గొన్నారని, ఎక్కడా ఎలాంటి గొడవలు, మతఘర్షణలు చోటు చేసుకోలేదని లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కాగా చిత్తాపురలో ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలనానికి అనుమతి నిరాకరిస్తూ కలబురగి జిల్లా యంత్రాంగం లా అండ్ ఆర్డర్ సమస్య కారణంగా చూపింది. రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల ద్వారా ఎలాంటి శాంతిభద్రతలకు భంగం కలగలేదని ప్రభుత్వమే శాసనసభ సమావేశాలలో అంగీకరించింది. ఉత్తరకన్నడ జిల్లాలో 45 పథసంచలనాలు, బాగల్కోటెలో 33, బీదర్ జిల్లాలో 41, శివమొగ్గలో 19, విజయపుర జిల్లాలో 18 పథసంచలనాలు జరిగాయి. ఇక బెళగావిలో 17, తుమకూరులో 11, చిత్రదుర్గలో 11, దక్షిణ కన్నడలో 10, ఉడుపిలో 10, చిక్కమగళూరులో 11, యాదగిరిలో 12, రాయచూరులో 10 పథసంచలనాలు జరిగాయి.

బీదర్-చామరాజనగర్ హైవే పనులు వేగవంతం

● మంత్రి సతీష్ జార్కిహొళి

బళ్లారి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకను ఏకం చేసి ఉత్తరం నుంచి దక్షిణ కర్ణాటకకు అనుసంధానించే బీదర్-చామరాజనగర్ హైవే కల్యాణ్ పాత్ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు బీదర్, కలబురగి, యాదగిరి, కొప్పల్, రాయచూర్ బళ్లారి, విజయనగరం, ప్రాంతాలైన కల్యాణ కర్ణాటక ప్రాంతాల్లో అమలు చేస్తున్నట్లు ప్రజా పనుల మంత్రి సతీష్ జార్కిహొళి అన్నారు. బుధవారం విధాన పరిషత్ సమావేశంలో సభ్యుడు శశిల్ జి. నమోషి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాదానం ఇచ్చారు. కల్యాణ పథ ప్రాజెక్టును కర్ణాటక గ్రామీణ రహదారి అభివృద్ధి సంస్థ (కేఆర్‌ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో చేపట్టామని వివరించారు. మొత్తం 1124.70 కిలో మీటర్ల రహదారులను రూ.1000 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

కుద్రేముఖ్ జాతీయ ఉద్యానవన వాసులకు

రూ.300కోట్లతో పునరావాసం

మంత్రి ఈశ్వర్‌ఖండ్రె

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుద్రేముఖ్ జాతీయ ఉద్యానవనం పరిధిలోని కుటుంబాల పునరావాసానికి రూ.300 కోట్లు కేటాయించనున్నట్టు అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె అన్నారు. కుద్రేముఖ్ జాతీయ ఉద్యానవనంలో 1,382 కుటుంబాలను తరలించేందుకు 2005లో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిందని, వీరిలో 670 కుటుంబాలు మార్పునకు అర్జీ సమర్పించాయని, వీరిలో 356 కుటుంబాలకు 142 కోట్ల పరిహారం ఇచ్చి తరలించామన్నారు. మిగిలిన 314 కుటుంబాలకు రూ.300కోట్లతో పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బెళగావి సువర్ణసౌధలో శాసనసభ శీతాకాల సమావేశాలలో బుధవారం ఎమ్మెల్యే అరగ జ్ఞానేంద్ర, టీడీ రాజేగౌడల ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. కుద్రేముఖ్ జాతీయ ఉద్యానవనం నుంచి బయటకు వచ్చేందుకు ఆసక్తి ఉన్న కుటుంబాలు తొలుత తహసీల్దార్ అధ్యక్షతన సమితికి అర్జీ సమర్పించాలన్నారు. సమితిలో రెవెన్యూ, ల్యాండ్ రికార్డ్స్, ఉద్యానవన, అటవీ, వ్యవసాయ, ప్రజాప్రయోజనాల శాఖ అధికారులు ఉంటారన్నారు. పునరావాసం కోసం అర్జీ సమర్పించిన కుటుంబం ఉంటున్న ఇల్లు, భూమి విలువను లెక్కించి జిల్లాఅధికారుల సమితికి సమర్పిస్తారని, అనంతరం జిల్లాధికారి అధ్యక్షతన సమితి పరిహారాన్ని నిర్ణయించి నిధుల విడుదలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుందన్నారు. దీని ప్రకారం ప్రభుత్వం 2025 సంవత్సర ధరల ప్రకారం పరిహారం అందిస్తుందని స్పష్టం చేశారు. కుద్రేముఖ్‌లో ఉంటున్న మిగిలిన కుటుంబాలను కూడా పూర్తిగా స్థలాన్నిమార్పు చేసి పునరావాసం కల్పించేందుకు రూ.600కోట్లు అవసరం కానుందన్నారు. కేంద్రప్రభుత్వ క్యాంపా (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజిమెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) నిధులు రాష్ట్రప్రభుత్వానికి సంబంధించి రూ.1400 కోట్లు ఉందన్నారు. కుద్రేముఖ్ జాతీయ ఉద్యానవనం పునరావాసానికి గ్రాంట్లు కల్పించాలని కోరుతూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కోరామన్నారు. అనుమతి లభించిన వెంటనే అన్ని కుటుంబాలను స్థలాంతరీకరణ చేసి పునరావాసం కల్పిస్తామన్నారు.

విద్యార్థుల వసతి గృహానికి కొత్త భవనం

● మంత్రి శివరాజ్ ఎస్ తంగడిగి

బళ్లారి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల మెరుగైన విద్య కోసం పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహానికి ప్రత్యేక భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామని వెనుకబడిన తరగతులు, కన్నడ, సాంస్కృతిక సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ ఎస్. తంగడిగి అన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో హాసన్ జిల్లాలోని హొలెనరసింపూర్ తాలూకాలో విద్యార్థి వసతి గృహాలకు ప్రత్యేక భవనం నిర్మాణం గురించి అడిగిన ప్రశ్నకు హొలెనరసిపూర్ ఎమ్మెల్యే హెచ్.డి. రేవణ్ణ సమాధానిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల మెరుగైన విద్య కోసం మంజూరైన పోస్ట్-మెట్రిక్ బాలికల వసతి గృహానికి ప్రత్యేక భవనం నిర్మాణాన్ని ప్రజా పనుల శాఖ చేపట్టిందని అన్నారు. హాసన్ కలెక్టర్ ఖాతాకు ఇప్పటికే రూ.2.50 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు.

నెలసరి సెలవు నిరాకరిస్తే రూ.5వేల జరిమానా..!

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో మహిళా ఉద్యోగులకు ప్రతినెలా ఒకరోజు వేతన సహిత నెలసరి సెలవును ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తే రూ.5వేల వరకు జరిమానా విధించేలా బిల్లు సిద్ధమైంది. నెలసరి కావడాన్ని చిన్నచూపు చూసినా, తారతమ్యం లేదా అస్పృశ్యతగా చూసేవారికి జరిమానా విధించేలా రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. కర్ణాటక మహిళా యోగక్షేమ సెలవు చట్టం 2025 ముసాయిదాను ప్రభుత్వం రూపొందించింది. ప్రస్తుత శాసనసభ శీతాకాల సమావేశాలలో సమర్పించే అవకాశం ఉంది. ఈ బిల్లు ప్రకారం యువతులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఈ సెలవు పొందేందుకు అర్హులు. రుతుచక్రం కల్గిన 18ఏళ్ల నుంచి 52 ఏళ్ల మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు అన్వయించనుంది. నెలకు ఒకటి చొప్పున సంవత్సరానికి 12 సెలవులు వర్తించనున్నాయి. నెలసరి సమయంలో తీవ్రమైన సమస్యలు ఉంటే మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్ అవసరం లేదు. ఎందుకంటే దాని వల్ల జాప్యం అయ్యే అవకాశం ఉంది. సంబంధిత సీనియర్ అధికారులకు వినతి లేదా ఇ-మెయిల్ పంపినా చాలు. నెలసరి సెలవును ఉన్నతాధికారులు అనవసరంగా ప్రచారం చేయరాదు. నెలసరి అయినవారు అర్ధరోజు కావాలంటే కూడా సెలవు తీసుకోవచ్చని బిల్లులో ప్రస్తావించారు. ఒకవేళ ఈ సెలవు వాడకుంటే మరుసటి నెలకు అన్వయించదు. సీఎల్, ఈఎల్ వంటి రోజుల్లో నెలసరి అయితే ప్రత్యేక సెలవుకు అవకాశం ఉండదు.

డాక్టర్ల కొరతతో రోగులకు అందని వైద్యం: ఎమ్మెల్సీ సతీష్

బళ్లారి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మెడికల్ అండ్ రీసెర్చ్ సెంటర్ (బీఎంఎస్)లో డాక్టర్ల కొరతతో రోగులకు వైద్యం అందడం లేదని ఎమ్మెల్సీ వైఎం సతీష్ అన్నారు. బెళగావిలో జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో బుధవారం ఎమ్మెల్సీ ఈ విషయంపై చర్చకు లేవనెత్తారు. బళ్లారిలోని విమ్స్ ఆసుపత్రిలో 450 పోస్టులకు గాను 162 మంది మాత్రమే ఉన్నారన్నారు. అలాగే 1071 సిబ్బందికి 213 మంది ఉన్నారన్నారు. డెంటల్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్, సర్జికల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. తక్షణం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. దీనిపై ఆరోగ్య శాఖ మంత్రి బదులిస్తూ ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేస్తామన్నారు. బళ్లారి థర్మల్ పవర్ ప్లాంట్‌కు 1,800.92 ఎకరాల భూములు ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిందని, సంబంధిత భూయజమానులకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని ఎమ్మెల్సీ అన్నారు. భూముల ఇచ్చినవారికి కంపెనీ ప్రతి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. నేటికీ ఏ ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు. మంత్రి కేజే జార్జ్ బదులిస్తూ 293 కుటుంబాల్లో 169 కుటుంబాలకు మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మిగిలిన వారికి కోర్టులో కేసు పెండింగ్ ఉండడం వల్ల ఆలస్యం అవుతుందన్నారు.

ఆశా కార్యకర్తలకు అండగా ఉంటాం: మంత్రి దినేశ్ గుండూరావ్

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు అండగా ఉంటామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ అన్నారు. బెళగావిలో బుధవారం ఆశా కార్యకర్తల ధర్నా స్థలానికి చేరుకుని వినతిపత్రాన్ని స్వీకరించి మాట్లాడారు. పలు పథకాలు కేంద్రం పరిధిలో ఉన్నాయని, గ్రాంట్లు విడుదల అయిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రూ.40కోట్లు కేటాయించామని, అందులో రూ23కోట్లు ఖర్చు కాగా ఇంకా రూ.17కోట్లు ఉన్నాయన్నారు. కేంద్రప్రభుత్వ వాటా 60శాతం నిధులు విడుదలైన వెంటనే రాష్ట్రవాటా విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం 30శాతం ఆశా కార్యకర్తలు రూ.10-15వేలు, 35-40 శాతం మంది రూ.9-10వేలు, 30శాతం మంది రూ.8-9వేలు పొందుతున్నారన్నారు. ఈ వ్యత్యాసం ఎందుకంటే జనాభా తక్కువ ఉన్న ప్రదేశాలకు ఇన్సెంటివ్ తక్కువగా ఉందన్నారు. సమస్య పరిష్కారానికి రెండురోజుల్లో ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ అవినాశ్ మెనన్ కూడా ఉన్నారు.



ఆశా కార్యకర్తల నుంచి వినతి స్వీకరిస్తున్న మంత్రి

గ్యారెంటీలపై అసంతృప్తి

● మార్పుపై నిర్ణయం అధిష్టానానిదే..

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేందుకు కారణమైన గ్యారెంటీలపై నిరంతరంగా సొంతపార్టీలోనే విమర్శలు సాగుతున్నాయి. ఇంతకు ముందు సభావేదికలు లేదా ఇతరత్రా కార్యక్రమాలు అంతకుమించి పాత్రికేయుల సమావేశంలో గ్యారెంటీలు సరికావంటూ వ్యాఖ్యలు తెలిసినవే. అటువంటిది ఏకంగా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పీ) సభలోనే పలువురు ఎమ్మెల్యేలు గ్యారెంటీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మంగళవారం రాత్రి బెళగావిలో కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షత వహించగా డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలందరూ పాల్గొన్నారు. శాసనసభ సమావేశాలలో ఉత్తరకర్ణాటకలో నెలకొన్న సమస్యలు గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేయాలని సూచిస్తూనే ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే అంశాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. రోజూ శాసనసభ కలాపాలలో భాగస్వాములు కావాలని సూచించినట్లు సమాచారం. ఇదే సందర్భంలోనే పలువురు ఎమ్మెల్యేలు గ్యారెంటీలు అమలు చేస్తుండటం ద్వారా అభివృద్ధికి తీవ్రమైన సమస్య అవుతోందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గ్యారెంటీలు ఆపి అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇదే సందర్భంలోనే మరికొందరు ఎమ్మెల్యేలు లక్ష రూపాయలు జీతం తీసుకునే మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం ఎంతవరకూ సమంజసమని అభ్యంతరం తెలిపినట్లు సమాచారం.

పలువురు మంత్రులు జోక్యం చేసుకుని గ్యారెంటీలతోనే మనకు ప్రజలు ఆశీస్సులు అందించినందున మార్పులు ఉండవని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కాగా మరికొందరు గ్యారెంటీలు ఎవరికి అవసరమనేది నిర్ధారించి వారికి మాత్రమే అమలు చేయడం సముచితమనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. గ్యారెంటీ పథకాలకు ఇటీవల ప్రజల నుంచి మంచి అభిప్రాయం లేదని పలువురు సూచించినట్లు తెలుస్తోంది. కేవలం గ్యారెంటీల ద్వారానే ముందుకెళితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుందని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. నాయకత్వ మార్పు కీలక అంశమే అయినా సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లకు మద్దతు ఇచ్చేవారు సైతం నోరు మెదపకుండా మౌనంగా ఉండిపోయారు. చివరకు సీఎల్‌పీలో ఎవరైనా ప్రస్తావిస్తారని అనుకున్నా సీఎం, డీసీఎంలు మేం కలిసే ఉన్నాం మా సమైక్యతకు ఢోకాలేదని మేం అన్నదమ్ములమంటూ పదేపదే చెబుతుండటంతో ఎమ్మెల్యేలు సాహసం చేయలేకపోయారు. పైగా శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత ఢిల్లీ నుంచి ఇద్దరు ముఖ్యులకు పిలుపు వస్తుందని అనుకుంటున్న తరుణంలోనే మరో బాంబులాంటి సమాచారం వచ్చింది. ఈనెల 19 వరకూ శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత రెండురోజులు వారాంతం కాగా సోమవారం 21వతేదీ నుంచి కాంగ్రెస్ కీలకనేత రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఆయన వెనుతిరిగి రావడం ఏడాది ముగుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని బట్టి ఈ ఏడాది నాయకత్వంలో ఎటువంటిమార్పులు లేవని తేల్చినట్లు అవుతోంది. కాగా మంత్రి భైరతి సురేష్ బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ టైగర్ జిందా హై... కింగ్ ఈజ్ అలైవ్ అంటూ వ్యాఖ్యానించారు.



సీఎల్పీ సమావేశంలో పాల్గొన్న సీఎం, డీసీఎం, మంత్రులు

విద్యార్థినికి లైంగిక వేధింపులు..

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యా బుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే దారితప్పేలా వ్యవహరిస్తుండడంతో తల్లిదండ్రులు, స్థానికులు గట్టిగా బుద్ధిచెప్పారు. హావేరి జిల్లా సవణూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిని లైంగికంగా వేధించారనే ఆరోపణలతో స్థానికులు దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. సవణూరులోని ప్రభుత్వ ఉర్దూ అప్‌గ్రేడ్ స్కూల్‌లో బుధవారం ఘటన చోటు చేసుకుంది. ఒక విద్యార్థిని పట్ల లైంగికంగా వేధించాడని టీచర్ జగదీశ్‌పై ఆరోపణలు వచ్చాయి. టీచర్ తీరుపై తీవ్ర ఆగ్రహంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఆగ్రహంతో ఉన్న ప్రజలు టీచర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం చెప్పులదండతో పట్టణంలోని రోడ్లపై ఊరేగించారు. అనంతరం సవణూరు పోలీసులకు అప్పగించారు. ఘటనపై అంజుమన్ కమిటీ ముఖ్యులు డాక్టర్ సలీం మాట్లాడుతూ టీచర్ జగదీశ్ ప్రవర్తనపై పలు ఆరోపణలు వచ్చాయని దీంతో ప్రజలు అతడికి బుద్ధి చెప్పారన్నారు. కడుపునొప్పి, జ్వరంతో ఉన్న బాలికను పరామర్శించే పేరిట లైంగికంగా వేధించాడని తెలుస్తోంది. పోక్సో కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుడికి చెప్పులతో ఊరేగింపు

ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధ్యమే

● ఐఏఎస్ రామ్‌ప్రసాత్ మనోహర్

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధ్యమేనని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఐఏఎస్ రామ్‌ప్రసాత్ మనోహర్ అన్నారు. జలమండలి అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. నగరంలోని విజయనగర్ ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో 'అస్పైర్ విత్ రామ్ ఐఏఎస్' కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. తన తల్లి అంగన్‌వాడీ కార్యకర్త అని, తండ్రి పోస్ట్‌మాస్టర్ అన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తాను ఒక లక్ష్యంతో ఎంతో శ్రమించి, క్రమశిక్షణతో పోటీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. జీవితంలో కుటుంబ సమస్యలు మన సాధనకు అడ్డుకారాదన్నారు. మనలోని శక్తిని ప్రేరేపించుకుని మనల్ని మనమే ప్రోత్సహించుకుని ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. ఆత్మవిశ్వాసంతో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని విద్యార్థులకు హితవు పలికారు. నాతండ్రికి వచ్చే జీతంతో కుటుంబం నడపడం కష్టంగా ఉండేదన్నారు. ఇప్పుడు తనకు ప్రైవేట్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కినా చదివే పరిస్థితి లేదన్నారు. చివరకు ప్రభుత్వ కళాశాలలో వెటర్నరీ కోర్సు పూర్తి చేశానని, సైంటిస్టు కావాలనే ఆశ ఉండేదన్నారు. ఇందుకు కేంద్రప్రభుత్వ స్కాలర్‌షిప్ నుంచి అవకాశం ఉండేదని, అయితే కాలేజీనుంచి వెళ్లిపోవడంతో స్కాలర్‌షిప్ దక్కలేదన్నారు. అప్పుడు నిరుత్సాహంతో ఎంతో ఏడ్చానని గుర్తు చేసుకున్నారు. అయితే కొంతమంది మిత్రుల ప్రోత్సాహంతో యూపీఎస్సీ పరీక్షలు రాసి ఐఏఎస్ అయి ఇప్పుడు మీముందు ఉన్నానని చెప్పుకొచ్చారు. కష్టాలు మన జీవితాలను తలకిందులు చేస్తాయని, వాటిని చూసి కుంగిపోరాదన్నారు. దురలవాట్లకు లోనుకారాదని, మంచి పుస్తకాలు చదవాలని, ఆరోగ్యంపై దృష్టి సారించాలని, చక్కటి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు ఏం చదవాలనేది కనీస అవగాహన ఉండాలన్నారు. దినపత్రికలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను బాగా చదవాలన్నారు. వీటితోపాటు చక్కగారాసే అలవాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. తనవంటి పేద విద్యార్థులకు యూపీఎస్సీ, కేపీఎస్సీ తదితర పోటీ పరీక్షలు రాసేవారు విజయం సాధించాలని ఆకాంక్షించారు. తన ప్రకారం కోచింగ్‌కంటే సరైన మార్గదర్శకం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శుభా, పోటీ పరీక్షల కోచింగ్ విభాగం సమన్వయాధికారి డాక్టర్ ఎన్ శోభారాణి ఉన్నారు.



రామ్‌ప్రసాత్ మనోహర్‌ను స్వాగతిస్తున్న ప్రముఖులు

రైతులను మోసగించిన వ్యాపారి అరెస్టు



అరెస్టు చూపుతున్న ఎస్ఐ శివ

బెళుగుప్ప, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల నుంచి పప్పుశనగ, ధనియాల పంటలను కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా మోసగించిన వ్యాపారి విక్రమ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్ రైతుల నుంచి రూ.2.65 కోట్లు విలువ జేసే ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మూడేళ్లుగా పరారీలో ఉన్నాడని తెలిపారు. మోసపోయిన బాధిత రైతులు ఈ యేడాది మార్చి 20న ఎస్పీకి ఫిర్యాదు చేశారని వివరించారు. మండలంలోని గుండ్లపల్లి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలిక గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా బుధవారం తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని బాలికకు మాయమాటలు చెప్పి బాలుడు మోసగించినట్లు వివరించారు. వారం రోజుల క్రితం బాలిక వారి బంధువుల ఊరిలో ప్రసవించింది. విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గౌస్‌బాషా ఇద్దరిని విచారించారు. ఇద్దరూ మైనర్లు కావడంతో గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నరసింహా రెడ్డి (ఫైల్)

తాడిమర్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పూల ఓబయ్యపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. రూ. 10 లక్షలకు పైగా అప్పులు ఉన్నట్లు తెలిపారు. అప్పులిచ్చిన వారి నుంచి ఇటీవల వేధింపులు ఎక్కువయ్యాయని సన్నిహితుల వద్ద చెప్పుకునేవాడు. బుధవారం ఉదయం భార్య కాంతమ్మ వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో నరసింహారెడ్డి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి పరిశీలించగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి.

క్యాన్సర్ బాధిత చిన్నారికి లోకేశ్ అండ

ఎమ్మెల్యే దగ్గుపాటి ఎల్‌ఓసీ ద్వారా రూ.12 లక్షల సాయం



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవ తీసుకుని బాలుడి సమస్యను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రూ.12 లక్షల సాయం అందించారు. నగరంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బెంగళూరులోని శంకర క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా బాలుడికి చికిత్స అందిస్తున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగా నెట్టుకొస్తున్న తల్లిదండ్రులకు మరింత భారంగా మారింది. వారు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటిని ఆశ్రయించారు. గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలుడి వైద్య చికిత్సలకు సాయం అందించాలని కోరారు. స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ పరిధిలో చికిత్సలకు ముందే ఎల్‌ఓసీ ద్వారా రూ.12 లక్షల సాయం అందించారు. దీంతో తల్లిదండ్రులు ఎమ్మెల్యేకి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాశాఖలో ఇద్దరికి ఉద్యోగోన్నతి

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. షేక్షావలి, సత్యనారాయణకు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇస్తూ.. ఒకరికి బుక్కపట్నం డైట్, మరొకరిని తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నియమించారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీలు మునీర్‌ఖాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోండి

సూపరింటెండెంట్ అమర్‌నాథ్

అనంతపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు తపాల శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తపాల ఎస్పీ కార్యాలయంలో పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ... పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపై తపాల అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం విధించిన లక్ష్యం మేరకు అధికారులు, సిబ్బంది పనిచేసేలా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో తపాల అసిస్టెంట్ సూపరింటెండెంట్లు ఉమామహేశ్వర్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు.

నేడే సీపీఐ వందేళ్ల వేడుకలు

ఉద్యమ కుటుంబాలకు సత్కారం

కేంద్ర, రాష్ట్ర నేతలు రాక

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ఆవిర్భవించి వందేళ్లు కావడంతో గురువారం అనంతలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐది ఘన చరిత్ర అన్నారు. అలాంటి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శతాబ్ది వేడుకలను గురువారం అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకోసం పోరాటాలు సాగిస్తూ అమరులైన కుటుంబాలకు ఆత్మీయ సత్కారం చేస్తామన్నారు. వేడుకలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నేతలు మల్లికార్జున, లింగమయ్య, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘరానా దొంగలు..!

తాళం వేసిన ఇళ్లే టార్గెట్... పగలు రెక్కీ.. రాత్రి చోరీలు

అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసిన పురం పోలీసులు

రూ.40 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడే ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను హిందూపురం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.40 లక్షల విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం వివరించారు. పట్టుబడినవారిలో గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ (ప్రస్తుతం పరిగి మండలం గొల్లపల్లిలో ఉంటున్నాడు), హిందూపురం మండలం హనుమేపల్లికి చెందిన బాబుప్రసాద్ (ప్రస్తుతం కర్ణాటకలోని విధురాశ్వత్థంలో ఉంటున్నాడు), హిందూపురం మండలం సంతేబిదునూరుకు చెందిన గంగరాజు, ఉప్పర సురేష్, గౌరీబిదనూరుకు చెందిన సిద్దిక్ సాబ్ ఉన్నారు. హిందూపురం సబ్ డివిజన్‌లో 2023 నుంచి ఇప్పటి వరకూ నమోదైన చోరీ కేసులను ఛేదించేందుకు పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమంలో సంతేబిదునూరుకు చెందిన పాత దొంగల ముఠా వెంట కొత్త వ్యక్తి తిరుగుతున్నాడని హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులుకు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వచ్చింది గుంటూరుకు చెందిన రత్నరాజు అని, చోరీల కోసం హిందూపురం ప్రాంతంలో రెక్కీ నిర్వహిస్తున్నారని తేలింది. దీంతో రత్నరాజును కూడా సీఐ అదుపులోకి తీసుకున్నారు. రత్నరాజు హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, మేళాపురంలో మూడేళ్ల క్రితం చోరీకి పాల్పడ్డాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. మిగిలిన ముఠా సభ్యులపై హిందూపురం వన్‌టౌన్ పరిధిలో రెండు, టూటౌన్ పరిధిలో మూడు, అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, గోరంట్లలో రెండు, సోమందేపల్లి, లేపాక్షి, చిలమత్తూరు, కదిరి ఒక్కో చోరీ కేసు ఉన్నాయి. తమ విచారణలో నిందితులు నేరాలు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. వారి నుంచి 310 గ్రాములు బంగారం ఆభరణాలు, 3 కిలోలకుపైగా వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటక, ఏపీలో తాళం వేసిన ఇళ్లను ముందుగా గుర్తిస్తారు. పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రిపూట ఇళ్లలో చొరబడి చోరీలు చేస్తుంటారు. దొంగల ముఠాను పట్టుకుని, కేసులను ఛేదించిన డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, కరీం, రాజగోపాల్, జనార్దన్, ఎస్ఐ శ్రీధర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులను అందజేశారు.

యువ ఖైదీలే పెట్టుబడి

రత్నరాజు జైలుకు వెళ్లిన ప్రతి సందర్భంలో జైలులో ఉన్న యువఖైదీలతో పరిచయం పెంచుకుంటాడు. ఎక్కడ చోరీ చేస్తే బాగుంటుందని ఆరా తీస్తాడు. ఆ ప్రాంత పోలీసుల పనితీరు గురించి కూడా తెలుసుకుంటాడు. ఏ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారి గట్టిగా ఉన్నాడు అనే కోణంలో కూడా ఆరాతీస్తాడు. అన్నీ తెలుసుకుని.. జైలు నుంచి బయటికి వచ్చాక అనువైన ప్రాంతాలలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి లూటీ చేస్తాడు. చోరీ చేసిన సొమ్ములో కొంత మాత్రమే వెంట వచ్చిన తోడుదొంగలకు ఇస్తాడు. మిగిలిన సొమ్మంతా తానే తీసుకుంటాడు.

వీడు మామూలోడు కాదు..

గుంటూరుకు చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ వయసు 39 సంవత్సరాలు. ఇతను స్కెచ్ వేశాడంటే ఇంటి చుట్టూ పది మంది కాపలా ఉన్నా లూటీ కావాల్సిందే అని పోలీసులు అంటున్నారు. ఇంత ఆరితేరిన దొంగను ఇప్పటి వరకు తాము చూడలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో నమోదైన మొదటి కేసులో జైలుకు వెళ్లిన సమయంలో ఖైదీలతో పరిచయం పెంచుకున్నాడు. బయటకు వచ్చాక ఆ ఖైదీలు ఉంటున్న ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డాడు. మొదట తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రెక్కీ నిర్వహిస్తాడు. ఒకటి రెండు రోజులు ఆ ఇళ్ల వద్ద పరిస్థితిని గమనిస్తాడు. ఇంటికిగాని, గేటుకుగాని తాళం వేసి ఉండి.. రెండు మూడు రోజులు పగలు, రాత్రి ఇంటి ముందు లైటు వెలుగుతూ ఉంటే.. ఆ ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుంటాడు. చోరీకి అనువైనదని భావిస్తాడు. ఆ తరువాత కొంత మంది దొంగలతో కలిసి ఇంటివద్దకు వెళ్తాడు. కానీ దొంగతనం చేసేది మాత్రం రత్నరాజు ఒక్కడే. పది మంది వెంట వెళ్లినా.. ఇంట్లోకి చొరబడి సొమ్ము తీసుకొచ్చేది అతనొక్కడే. ఎందుకంటే తన వెంట వచ్చిన దొంగలనే నమ్మడు. రత్నరాజుపై ఇప్పటి వరకూ 55 చోరీ కేసులు నమోదయ్యాయి. పోలీసుల దృష్టికి రానివి ఇంకెన్ని ఉంటాయో తెలియదు.

చోరీ సొమ్ముతో గుంటూరులో ఇళ్ల నిర్మాణం

ఇళ్లలో చొరబడి చోరీ చేసిన సొమ్ముతో తన సొంతూరు గుంటూరులో రత్నరాజు రెండు ఇళ్లను నిర్మిస్తున్నాడు. వీటి నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.2 కోట్లు ఖర్చయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ జిల్లా అధికారుల ద్వారా కోర్టు అనుమతితో ఇళ్లను అటాచ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో ఇద్దరే..!

తాడిపత్రిలో అధ్వానం... వైద్యుడు, అటెండరే దిక్కు

మందులు కూడా లేని దుస్థితి

కార్మికులకు తప్పని తిప్పలు



ఈఎస్ఐ ఆసుపత్రి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాపరాళ్లు, గ్రానైట్, సిమెంట్, ఐరన్ తదితర పరిశ్రమలు వందల సంఖ్యలో తాడిపత్రి ప్రాంతంలో ఉన్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. అలాంటి కీలక ప్రాంతంలోని కార్మిక బీమా వైద్యశాలలో అన్నీ సమస్యలే. సిబ్బంది లేరు, సౌకర్యాలూ లేవు. వైద్యుడు, అటెండర్‌తోనే నెట్టుకొస్తున్నారు. ఫార్మాసిస్టు, నర్సు, క్లర్క్, స్వీపర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వేలాది కార్మిక కుటుంబాలు పరిశ్రమల్లో నివాసం ఉంటూ ఏ చిన్న ప్రమాదం జరిగినా ఈఎస్ఐ ఆస్పత్రికి వస్తున్నారు. ఇక్కడ సిబ్బంది, మందుల కొరతతో వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్యం అందదన్న ఉద్దేశంతో చాలామంది ఆస్పత్రికి రావడమే లేదు. ఒకవేళ వెళ్తే ఉన్న మందులు ఇచ్చి.. మిగిలినవన్నీ బయట తీసుకోవాలని రాసి పంపుతున్నారు. ఆస్పత్రిలో కనీసం స్వీపర్ కూడా లేడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మందులు లేక బయటకు పంపించారు: వీరప్ప



బీపీ, మధుమేహంతో బాధపడుతున్నా. వాటితోపాటు జ్వరం రావడంతో ఆస్పత్రికి వస్తే మధుమేహానికి మందులు లేకపోవడంతో బయటకు రాసిచ్చారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

త్వరలోనే మందులు వస్తాయి: వెంకటేశ్వర్లు, వైద్యుడు



కొన్ని మందులు లేవనేది వాస్తవమే. ఇండెంట్ పెట్టాం. త్వరలోనే మందులు వస్తాయి. అన్ని మందులు ఆస్పత్రిలో ఇచ్చేలా చర్యలు చేపడతాం.

ఏళ్లుగా ఎదురుచూపు

వితంతువులకు అందని పింఛన్

కుటుంబ పోషణకు పలువురి ఇబ్బంది

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ



పింఛన్లు నమోదు చేసుకునే సచివాలయం

అమడగూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పింఛన్ కోసం మండలంలోని పలువురు వితంతువులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారు ఆయా గ్రామాల అధికార పార్టీ నాయకులు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే మరుసటి నెల నుంచే అతడి భార్యకు ఆయన పింఛన్‌ను అందిస్తున్న ప్రభుత్వం తమ పట్ల శీతకన్ను వేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి తమకు పింఛన్ అందిస్తే తమ కుటుంబాల జరుగుబాటుకు ఆసరాగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

రెండేళ్లు గడుస్తున్నా...: వెంకటమ్మ, ఎస్సీ కాలనీ



నా భర్త చనిపోయి రెండేళ్లకు పైబడింది. నాకు ఇద్దరు కుమారులు, కూలి పని చేస్తూ, పిల్లలను చదివించుకుంటున్నా. ఆస్తులు ఏ మాత్రం లేవు. ఉండటానికి ఇల్లు మాత్రమే ఉంది. వితంతు పింఛన్ అందిస్తే కొద్దిగా ఊరట కలుగుతుంది. అధికారులు స్పందించి పింఛన్ అందేలా చూడాలి.

సచివాలయంలో నమోదు చేయించా : మంజుల, మహమ్మదాబాద్



భర్తను కోల్పోయి మూడేళ్లు అయ్యింది. పింఛన్ కోసం సచివాలయంలో పలుమార్లు నమోదు చేయించా. అయినా పింఛన్ అందడం లేదు. ఆధార్, రేషన్‌కార్డు అన్ని ఇదే గ్రామంలో ఉన్నాయి. నాకు ఒక కుమారుడు, నామీదే ఆధారపడిన అవ్వ ఉన్నారు. నిత్యం కూలి పనికి పోతేనే ముద్ద నోట్లో దిగేది. పింఛన్ అందిస్తే కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుంది.

సైట్ ఓపెన్ కాగానే...: మునెప్ప, ఎంపీడీవో

కొత్త పింఛన్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు సైటు ప్రారంభించలేదు. సైటు ఓపెన్ కాగానే అర్హులైన వారి పేర్లు నమోదు చేసి, తప్పనిసరిగా పింఛన్‌లు అందిస్తాం. ఎవరైనా ఆధార్, రేషన్‌కార్డు పక్క మండలాలలో ఉంటే అలాంటి వారికి అందించేందుకు వీలు కాదు. అర్హులైన వారికి తప్పనిసరిగా అందిస్తాం.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

బుక్కపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్లను శుక్రవారం ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూల ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్ మహిళలు, పురుషుల విభాగంలో ఎంపిక పోటీలను బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే 44వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9573065966 నెంబరును సంప్రదించాలన్నారు.

నకిలీ సిమెంట్ బాగోతం బద్దలు

15 ఏళ్ల దందాలో రూ.కోట్ల ఆర్జన

విజిలెన్స్ దాడుల్లో గుట్టురట్టు

పెనుకొండ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర దశాబ్ద కాలం నుంచి సాగుతున్న అక్రమ వ్యాపారం బాగోతం బట్టబయలైంది. విజయవాడకు చెందిన మహేష్ గోరంట్ల మండలం గుత్తివారిపల్లి సమీపంలో 15ఏళ్ల కిందట కస్తూరీ సిమెంటు ఫ్యాక్టరీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇక్కడి నుంచి లేపాక్షి సిమెంటు పేరుతో సిమెంటు తయారు చేయడానికి అనుమతి పొందాడు. అయితే అతడు నకిలీ సిమెంటు తయారు చేసి, ప్రముఖ కంపెనీల పేరుతో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. విజిలెన్స్ తనిఖీలో ఈ విషయం ఇటీవల వెలుగు చూసింది. నకిలీ సిమెంట్ తరలించడానికి తొలుత వివిధ రకాల సిమెంటు కంపెనీల పేర్లున్న ఖాళీ సంచులను తమిళనాడు నుంచి తెస్తారు. బయట లారీల్లో వచ్చిన బూడిద(ఫ్లైయాష్), 20శాతం సిమెంటు కలిపి ఆ సంచుల్లో నింపుతారు. దాన్ని ప్రముఖ సిమెంటు కంపెనీల పేరుతో కర్ణాటకకు తరలించి విక్రయిస్తాడు. ఒక సిమెంటు బస్తా తయారీకి రూ.50 ఖర్చవుతుండగా లాభం రూ.300 వస్తోంది. రసీదులు కూడా నకిలీవి తయారు చేయించి, కర్నూలు నుంచి ఇన్వాయిస్ ఇస్తూ నకిలీ సిమెంటు బస్తాలు తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో విజయవాడకు చెందిన నిర్వాహకుడు మహేష్‌పై క్రిమినల్ కేసు నమోదుచేశారు. 15ఏళ్లలో నకిలీ సిమెంటు తయారు చేసి దాదాపు రూ.43కోట్లు దోపిడీ చేశారని విజిలెన్స్ అధికారుల దాడుల్లో తేలింది. స్థానికులకు అనుమానం రాకుండా ఉండేందుకు సిమెంటు కంపెనీలో పనిచేసేందుకు ఇతర ప్రాంతాల వారిని పెట్టుకుని వ్యవహారం కొనసాగించాడు. నకిలీ వ్యవహారం బయట పడటంతో సిమెంటు ఫ్యాక్టరీ నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు. గోరంట్ల పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.

నకిలీ సిమెంటు పరిశ్రమ



పోస్టాఫీసుల నిర్మాణాలు చేపట్టండి

● లోక్‌సభలో ఎంపీ అంబికా



అనంతపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీసుల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు సేవలందించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర కమ్యూనికేషన్స్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ.. కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీసుల పునరావృత మార్పుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ మండలాల్లో శాశ్వత పోస్టాఫీస్ భవనాలు లేకపోవడంతో ప్రజలు అత్యవసర పోస్టల్ సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. శాఖ ఇప్పటికే సొంత భూములు కలిగి ఉన్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభంకాకపోవడంతో సేవలు అందుబాటులోకి వచ్చేందుకు ఆలస్యమవుతోందన్నారు. నిర్మాణాలు ఆలస్యం కావడంతో ఆ భూములు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఎంపీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని స్పందిస్తూ... కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీస్ శాశ్వత భవనాల నిర్మాణంపై సమీక్ష చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

అనంతను అగ్రభాగాన నిలపాలి

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్షర క్రమంలోనే కాదు.. పురోగతిలోనూ ఏడీసీసీ బ్యాంకును రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లోని సమావేశ మందిరంలో ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి బ్రాంచ్‌లు, వాటి పరిధిలోని సొసైటీల వారిగా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు రూ.580 కోట్లు ఉందని, 2026 మార్చి నాటికి రూ.700 కోట్లకు సేకరించాలని మేనేజర్లను ఆదేశించారు. అదే విధంగా బ్యాంకు వ్యాపార టర్నోవర్ రూ.2080 కోట్ల నుంచి ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.2500 కోట్లకు పెంచాలని సూచించారు. త్వరలో బ్యాంకులో ఏకకాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్) అమలు చేసి, రైతులకు రుణవిముక్తి కల్పిస్తామని తెలిపారు.

ఆచార్యరత్న బాహుబలి విగ్రహ ఏర్పాటుకు

డీసీఎం భూమిపూజ



భూమి పూజలో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బెళగావి పరిధిలోని హలగా - బస్తవాడలో బాహుబలి విగ్రహ ఏర్పాటుకు డీసీఎం డీకే శివకుమార్ భూమి పూజ చేశారు. బుధవారం ఆచార్యరత్న 108 బాహుబలి మునిరాజ 94వ జయంతి, సర్వదోష ప్రాయశ్చిత్త కార్యక్రమంలో డీసీఎం పాల్గొన్నారు. బాహుబలి విగ్రహం ప్రజలకు ఒక సందేశం ఇస్తుందని డీసీఎం తెలిపారు. జైన పద్ధతి, సంస్కృతి కఠినమైనదే అయినా శతాబ్దాలుగా పాటిస్తున్నారు. జైన సమాజం శాంతి, హింస, త్యాగాలకు ప్రతీక అన్నారు. మతం ఏదైనా ఆశయం ఒక్కటేనని భక్తి ఏదైనా పూజ ఒక్కటే అన్నారు. మన నమ్మకమే మన ఆశయం కావాలన్నారు. ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే సాధన, ఆధ్యాత్మికం ఎప్పటికీ మరువలేమన్నారు. నిరంతరంగా జైన సమాజంతో కలిసి ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డీసీఎం లక్ష్మణసవది, మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాళ్, ఎమ్మెల్యే బాబాసాహెబ్ పాటిల్, ఎమ్మెల్సీ చెన్నరాజ హట్టిహోళిలు పాల్గొన్నారు.

బెళగావిలో సీఎంను కలిసిన వెంకటేశ్ ప్రసాద్




సీఎం, డీసీఎంలతో కేఎస్‌సీఏ పదాధికారులు

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ బెళగావిలో బుధవారం సీఎం సిద్దరామయ్యను కలిశారు. బెళగావిలో శాసనసభ సమావేశాలు జరుగుతున్నందున ముఖ్యమంత్రి సహా మంత్రులందరూ ఉన్నారు. దీంతో వెంకటేశ్‌ప్రసాద్ సహా పలువురు క్రికెట్ కమిటీ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిశారు. ఇదే సందర్భంగా చిన్నస్వామిస్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగేందుకు తమవంతుగా సహకరిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి పాటుపడాలని కొత్త కమిటీ చేపట్టే కార్యక్రమాలకు తమవంతు మద్దతు ఉంటుందన్నారు. చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ సహా పలు మ్యాచ్‌లు జరిగే విషయమై శాసనసభలో గురువారం చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్‌సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాటలో 11 మంది అభిమానుల మృతికి సంబంధించి ప్రభుత్వం నియమించిన మైఖేల్‌కున్హా కమిటి నివేదికను అమలు చేస్తామని వెంకటేష్ ప్రసాద్ హామీ ఇచ్చారు. దీంతో వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ పోటీలు చిన్నస్వామిలో జరుగవంటూ కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారంపై క్రికెట్ అభిమానులలో ఉండే ఆందోళన తొలగించినట్లు అవుతోంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సుబ్రహ్మణ్య భారతి (జయంతి)




భారతీయార్‌గా చిరపరిచితులైన సుబ్రహ్మణ్య భారతి 1882 డిసెంబరు 11న ఎట్టాయపురంలో జన్మించారు. తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త. ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శిగా, మహాకవి భారతిగాను సుప్రసిద్ధులు. సంస్కృతం, హిందీ, తెలుగు, ఆంగ్లం, ఫ్రెంచ్, అరబ్బీ భాషల్లో అపార పాండిత్యం సంపాదించారు. 11ఏళ్ల ప్రాయంలోనే ఆయన 'భారతి' బిరుదును సొంతం చేసుకోవడం విశేషం. 38వ ఏట 1921 సెప్టెంబరు 22న ఆయన కన్నుమూశారు.

దిలీప్ కుమార్ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత దిలీప్ కుమార్ 1920 డిసెంబరు 11న ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషావర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు మొహ్మద్ యూసుఫ్ ఖాన్. సినిమాల కోసం పేరును మార్చుకున్నారు. అత్యధిక పురస్కారాలు పొందిన భారతీయ నటుడిగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించారు. ఎనిమిదిసార్లు ఫిలింఫేర్ పురస్కారం పొందిన ఆయన హిందీ సినీ రంగంలో 'ట్రాజెడీ కింగ్'గా పేరొందారు. పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం పొందారు. 98వ ఏట 2021 జూలై 7న కన్నుమూశారు.

ఓషో రజనీష్ (జయంతి)



ప్రపంచ వ్యాప్తంగా 'ఓషో రజనీష్'గా గుర్తింపు పొందిన చంద్రమోహన్ జైన్ మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉదయ్‌పూర్ తాలూకా కుచ్‌వాడా గ్రామంలో 1931 డిసెంబరు 11న జన్మించారు. గొప్ప ఆధ్యాత్మిక గురువుగా కోట్లాది మంది భక్తులను సంపాదించుకున్నారు. ఓషో అన్ని మతాలకు సంబంధించిన ధర్మగ్రంథాలపై అనర్గళంగా ప్రసంగించేవారు. అంతర్జాతీయస్థాయిలో ఓషో సంస్థ సేవలు నేటికీ బహుళ ప్రాచుర్యం పొందుతున్నాయి. ఆయన జీవితంపై డాక్యుమెంటరీలు, సినిమాలు రూపొందాయి. ఆయన బోధనలు పాశ్చాత్య దేశాలలో కొత్త ఒరవడి సృష్టించాయి. 1990 జనవరి 19న కన్నుమూశారు.

ప్రణబ్ ముఖర్జీ (జయంతి)



దేశ 13వ రాష్ట్రపతిగా వ్యవహరించిన 'భారతరత్న' గ్రహీత ప్రణబ్ ముఖర్జీ 1935 డిసెంబరు 11న బెంగాల్‌లో జన్మించారు. 2012 నుంచి 2017 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. ఐదు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్రను పోషించి పలు ఉన్నత పదవులను అలంకరించారు. దేశంలోని అత్యుత్తమ పార్లమెంటేరియన్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆర్థిక, విదేశీ వ్యవహారాలు, డిఫెన్స్ మంత్రిగా, లోక్‌సభ, రాజ్యసభలలో అధికారపార్టీనేతగా, ప్లానింగ్ కమిషన్ అధ్యక్షుడిగా కొనసాగారు. 2020 ఆగస్టు 31న ఆయన కన్నుమూశారు.

ఎంఎస్ సుబ్బులక్ష్మి (వర్ధంతి)



'భారతరత్న' అందుకున్న తొలి సంగీత కళాకారిణి మదురై షణ్ముఖవడివు (ఎంఎస్) సుబ్బులక్ష్మి 1916 సెప్టెంబరు 16న తమిళనాడు రాష్ట్రం మదురైలో జన్మించారు. ఆమె ఆలపించిన భజగోవిందం, విష్ణు సహస్రనామం, వెంకటేశ్వర సుప్రభాతం వంటివి ప్రపంచ వ్యాప్తంగా బహుళ ప్రజాదరణ పొందాయి. రామన్ మెగసెసే పురస్కారం అందుకున్న తొలి భారతీయ సంగీత కళాకారిణి, ఐక్యరాజ్య సమితిలో సంగీత కచేరీ నిర్వహించిన తొలి భారతీయ కళాకారిణిగా ఘనత సాధించారు. టీటీడీ ఆస్థాన విద్వాంసురాలిగా సేవలందించారు. 200కుపైగా చారిటీ కార్యక్రమాలు అందించారు. 2004 డిసెంబరు 11న ఆమె కన్నుమూశారు.

పండిట్ రవిశంకర్ (వర్ధంతి)



సితార్ అంటే పండిట్ రవిశంకర్ గుర్తుకొచ్చేలా పేరొందిన ఆయన బెంగాల్‌లో 1920 ఏప్రిల్ 7న జన్మించారు. అసలు పేరు రవీంద్ర శంకర్ చౌదరి. 20వ శతాబ్దంలో సితార్‌తో సంగీత ప్రియులను ఓలలాడించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, అత్యున్నత 'భారతరత్న' పురస్కారం అందుకున్నారు. పేరొందారు. 1970 నుంచి 1980 వరకు ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఎంతో వన్నెతెచ్చారు. ప్రతిష్టాత్మక గ్రామీ పురస్కారం అందుకున్నారు. 2012 డిసెంబరు 11న కన్నుమూశారు.

దేవదత్ పట్టనాయక్ (పుట్టినరోజు)



ప్రఖ్యాత రచయిత, వక్త దేవదత్ పట్టనాయక్ 1970 డిసెంబరు 11న ముంబైలో జన్మించారు. మైథాలజీపై ఆయన పెక్కు రచనలు చేశారు. మహాభారతం, రామాయణం వంటి గ్రంథాల సారంతో మానవ వనరులను ఏవిధంగా తీర్చిదిద్దుకోవచ్చునో ప్రయోగాత్మకంగా చూపించారు. కాల్పనిక కథలు, ఊహా చిత్రాలతో ఆకట్టుకున్నారు. రేడియో కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ ఆంగ్ల పత్రికలలో కాలమిస్ట్‌గా ఉన్నారు.

పత్తి చోరీ

● కడగందొడ్డి రైతు ఇంటి వద్ద ఘటన

రాయచూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని కడగందొడ్డి గ్రామంలో రైతు తాను పండించిన పత్తిని ఇంటి ముందు నిల్వ ఉంచుకోగా అర్ధరాత్రి వేళ దొంగలు ఎత్తుకెళ్లారు. కడగందొడ్డి గ్రామానికి చెందిన ఖాజా హుసేన్ అనే రైతు తన పొలంలో పండించిన పత్తిని ఇంటి నిల్వ ఉంచాడు 50 నుంచి 55 కిలోల బరువు ఉన్న 10 సంచులను ఇంటి వద్ద నిల్వ ఉంచగా మంగళవారం అర్ధరాత్రి దొంగలు పత్తిమొత్తాన్ని ఎత్తుకెళ్లారు. తెల్లారి దొంగతనం జరిగినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం రాయచూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన



బాగేపల్లిలో యముడి వేషధారితో కలిసి అవగాహన కల్పిస్తున్న పోలీసులు



కైవార క్రాస్‌లో పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

» పోలీసుల వినూత్న జాగృతి - జరిమానా వసూలు

» రేపటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

బాగేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో రోడ్డు ప్రమాదాలలో ఎక్కువమంది ద్విచక్రవాహనదారులు మృత్యువాత చెందుతున్నారు. అత్యధిక కేసులలో హెల్మెట్ ధరించకపోవడమేనని గుర్తించారు. హెల్మెట్ అందుబాటులో ఉన్నా ధరించకపోవడం, అనుకోకుండా జరిగే ప్రమాదంలో మృత్యువాత చెందడం వంటివి అధికం కావడంపై పోలీసుశాఖ వినూత్నంగా జాగృతి చేపట్టింది. వాహనదారులను చైతన్యం చేసేలా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 12నుంచి ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసినట్టు టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రశాంత్‌వర్ధి నేతృత్వంలో కార్యాచరణ చేపట్టారు. తొలుత పోలీసులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్వయంగా సీఐ ప్రశాంత్‌వర్ధి కొంతమంది వాహనచోదకులకు గులాబీలు అందచేసి హెల్మెట్‌ధారణ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా యముడి వేషధారి, సమాజ కార్యకర్త గోవిందరాజు మాట్లాడుతూ మీ ప్రాణాలంటే మీకు లెక్కలేదా... ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే... మిమ్మల్ని యమలోకానికి తీసుకెళ్తానంటూ పేర్కొన్నారు. సీఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైక్ లేదా ద్విచక్రవాహనం నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఈనెల 12నుంచి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠినచర్యలు, జరిమానా తప్పవని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా 18ఏళ్లలోపువారు నడిపితే సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని, వాహన యజమానిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. వీలింగ్ చేయడం, మద్యం తాగి వాహనం నడపడం, సైలెన్సర్ లేకుండా ఎక్కువశబ్దాలు వచ్చేలా వాహనాలు నడిపినట్టు గుర్తిస్తే అక్కడికక్కడే కఠినచర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది శ్రీనివాస్, ఆనంద్, ధనంజయకుమార్, మునిరత్నం, బయ్యారెడ్డి, కృష్ణప్ప, వివిధ సంఘాల పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

చింతామణి రూరల్ పోలీసుల జాగృతి

చింతామణి(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ద్విచక్ర వాహనదారుల సురక్షత దృష్ట్యా ఈనెల 12నుంచి తప్పనిసరి హెల్మెట్ అమలు చేస్తున్నామని ప్రజలు గుర్తించి సహకరించాలని చింతామణి రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివరాజ్‌కుమార్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చింతామణి - బెంగళూరు రాష్ట్ర రహదారి కైవార క్రాస్ వద్ద బుధవారం ప్రత్యేక జాగృతి బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వెళ్తున్న వాహనదారులకు పుష్పాలు అందచేసి అభినందించారు. చట్టం అంటే భయం లేకున్నా, మీ బతుకు, మీపై ఆధారపడి ఉన్నవారిని గుర్తించి కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయినప్పుడు బాధపడడం కంటే ముందస్తు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, బీమా ఇతర రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 18 వాహనదారులకు జరిమానాగా రూ.8,700 విధించినట్టు తెలిపారు. జాగృతిలో భాగంగా సమాజసేవకుడు సంతేకల్లహళ్ళి చంద్రశేఖర్ తరపున 15మందికి హెల్మెట్‌లను ఉచితంగా అందచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నరసింహ, హరీశ్, వీరేగౌడ తదితరులు ఉన్నారు.

కోరమంగల పంచాయతీ అధ్యక్షుడిగా చన్నేగౌడ



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

విజయపుర, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి కోరమంగల గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా చన్నేగౌడ, ఉపాధ్యక్షురాలిగా కనకరత్నమ్మ బలరామ్ గెలుపొందారు. రెండో అవధికి మంగళవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షస్థానానికి ముగ్గురు పోటీకి సిద్ధం కాగా తాలూకా కాంగ్రెస్ నేతల జోక్యంతో ఒకటో వార్డుకు చెందిన చన్నేగౌడ ఏకగ్రీవం సాధ్యమైంది. ఉపాధ్యక్షస్థానానికి కనకరత్నమ్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆమె కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా దేవనహళ్ళి పట్టు సహాయక డైరెక్టర్ పీ ధనంజయ, సహాయకులుగా పీడీఓ రాఘవేంద్ర వ్యవహరించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను స్థానిక సభ్యులు, ప్రముఖులు ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పశివరాజ్, హరీశ్‌కుమార్, గాయత్రి తిలక్, దండిగానహళ్ళి దేవరాజ్, మంజుళా అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

వీటీయూ కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ సంగప్ప



డాక్టర్ సంగప్పను సన్మానిస్తున్న దృశ్యం

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బెళగావి విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీటీయూ) కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ సంగప్ప నామినేట్ అయ్యారు. బెంగళూరు కమ్మవారిసంఘం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్‌గా, కేఎస్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఈసీఈ విభాగం ప్రాధ్యాపకులుగా డాక్టర్ సంగప్ప కొనసాగుతున్నారు. వీటీయూ కార్యవర్గ సభ్యుడిగా నామినేట్ అయిన ఆయన మూడేళ్లపాటు కొనసాగనున్నారు. కాగా న్యూఢిల్లీలోని ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ)లో జాతీయ కార్యవర్గ మండలి సభ్యుడిగా కర్ణాటకనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డాక్టర్ సంగప్ప వీటీయూ కార్యవర్గ సభ్యుడిగా నామినేట్ అయిన తరుణంలో కేఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ఆత్మీయంగా సత్కరించారు.

45 సిలిండర్ల పట్టివేత



సిలిండర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

బళ్లారి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని గౌతమ్‌నగర్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 45 గ్యాస్ సిలిండర్లను సీఐ ఉదయ్ రవి, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వంటగ్యాస్‌కి వినియోగించే సిలిండర్లను ఆటోలకు ఫిల్లింగ్ చేస్తున్నట్లు సమాచారం రావడం దాడులు చేశామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అవినీతిని నిర్మూలించండి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కేఆర్ఎస్ పార్టీ నాయకులు

బళ్లారిసిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుంచి లంచం తీసుకునే వారిపై నిఘా ఉంచి అవినీతిని నిర్మూలించాలని కేఆర్ఎస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ యూనిట్ జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటేశులు అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్‌ను కోరారు. అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయన అదనపు కలెక్టర్‌ను కలిశారు. అవినీతి అధికారులు, సిబ్బందితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లంచం తీసుకునేవారిపై లోకాయుక్త కఠినంగా వ్యవహరించాలని కోరారు.

భూగర్భ జలాలను సంరక్షించాలి

● వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ హనుమంతప్ప

రాయచూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజ సంపదగా ఉండే భూగర్భ జలాలను సంరక్షించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ హనుమంతప్ప అన్నారు. భూగర్భ జలలు తగ్గిపోతుండడం వల్ల ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిరక్షణ లభ్యత తదితర అంశాలపై బుధవారం రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఇంజనీయరింగ్ విద్యార్థుల కోసం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ నీటిని సద్వినియోగం చేయడంతో పాటు వృథా నీటిని తిరిగి ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర భూగర్భ జలమండలి ప్రాంతీయ డైరెక్టర్ కృష్ణమూర్తి భూగర్భ జలాల లభ్యత వినియోగం తదితర అంశాలకు సంబంధించి విద్యార్థులకు మూడు దశల శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. భవిషత్తులో నీటి సమస్య తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్న నేపథ్యంలో జాగ్రతను ఇప్పటి నుంచే ప్రారంభించాల్సి ఉందన్నారు. ఆ దిశగా ఇంజనీయరింగ్ విద్యార్థులు సాగునీటి సద్వినియోగం పట్ల తమదైన పద్ధతిలో అవగాహన పెంచుకుని రైతులకు వివరించాల్సి ఉంటుందన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ హనుమంతప్ప

రాయచూరు, కొప్పళ జిల్లాలో విలువైన ఖనిజాలు

● ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు

రాయచూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పరిశోధనల ఆధారంగా రాయచూరు-కొప్పళ జిల్లాల్లో విలువైన ఖనిజ నిక్షేపాలున్నట్లు గుర్తించామని రాష్ట్ర భూగర్భ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో తమన కలిసి విలేఖరులతో మాట్లాడిన అధికారులు కొప్పళ జిల్లాలో బంగారు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని అదే విధంగా రాయచూరు జిల్లాలో లిథియం నిక్షేపం ఉన్నట్లు తమ ప్రాథమిక సర్వేలో గుర్తించామన్నారు. ఈ రెండు నిక్షేపాలకు సంబంధించి ఉన్న ప్రదేశాలు పూర్తిగా అటవి ప్రాంతంలో ఉన్నందువల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. తాము నిర్వహించిన ప్రాథమిక సర్వే ఆధారంగా ఖనిజాలు ఉన్నట్లు గుర్తించడంతో పాటు వాటి అంచనా వేయలను కూడా గుర్తించామన్నారు. ప్రస్తుతం రాయచూరు జిల్లాలోని హట్టి బంగారు గనుల పరిధిలో టన్ను తవ్వకానికి 2 నుంచి 2.5 గ్రాముల బంగారు లభ్యం ఉండగా కొప్పళలో టన్నుకు 12 నుంచి 14 గ్రాముల బంగారం లభించే అవకాశం ఉన్నట్లు తమ పరిశోధనలో తేలిందన్నారు. చివరి పరిశోధనల అనంతరం కేంద్ర ప్రభుత్వం అనుమతితో తవ్వకాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. కాగా జమ్ము-కాశ్మీర్‌లో మాత్రమే ఉండే లిథియం నిక్షేపాలు రాయచూరు జిల్లాలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వం అటవి అడ్డుమత్తులను మంజూరు చేస్తే లిథియం ఖనిజం ఉన్న తొలి రాష్ట్రంగా కర్ణాటక దక్షిణ భారతంలోనే గుర్తింపు పొందనుందన్నారు.



దొరకిన విలువైన ఖనిజ నిక్షేపాలు (ఫైల్)



బస్టాండ్‌లో రమేశ్ సిద్దప్పను అభినందిస్తున్న మిత్రులు

ఎంఈజీకి ఎంపికైన డిప్లొమా విద్యార్థి

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా రామదుర్గ తాలూకా కుళ్ళూరు గ్రామానికి చెందిన యువకుడు రమేశ్ సిద్దప్ప మిలిటరీకి అనుబంధమైన మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్ (ఎంఈజీ)కు ఎంపికయ్యారు. డిప్లమో మూడో సంవత్సరం చదువుతున్న రమేశ్ సిద్దప్ప మద్రాస్‌కు బయల్దేరాడు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి గ్రామస్తులు, సహచర మిత్రులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఆర్మీ ద్వారా దేశానికి మంచి సేవలు అందించాలని అభినందించారు.

మళ్లూరాంబ దేవాలయంలో విశేష పూజలు



ముస్తాబైన ఆవులకు పూజలు

శిడ్లఘట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని అత్యంత పురాతన దేవాలయమైన దేవరమళ్ళూరు గ్రామంలోని మళ్ళూరాంబ దేవాలయ రథోత్సవం నేపథ్యంలో పశువుల జాతర సాగుతోంది. ముస్తాబు చేసిన ఆవులకు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు, సమాజసేవకుడు పంచాక్షరి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామదేవతకు ఏటా జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడం, అందరూ పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇదే సందర్భంగా ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ.లక్ష రూపాయల విరాళాన్ని అందచేశారు. ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు మునిరాజు, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు పవిత్రదేవరాజ్, ఉపాధ్యక్షురాలు అనసూయమ్మ, ప్రముఖులు వెంకోబరావ్, న్యాయవాది సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కాన్ ప్రదర్శనలో అధునాతన ఉత్పత్తులు



సరికొత్త టైర్ల ఆవిష్కరణ

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఐఐ ఎక్స్‌కాన్ 2025లో సరికొత్త ఉత్పత్తులు, యంత్రోపకరణాలను ప్రదర్శిస్తున్నారు. నిర్మాణ, మట్టి తవ్వకం, వస్తునిర్వహణ టైర్ల ప్రముఖ గ్లోబల్ బ్రాండ్ గ్యాలక్సీ సంస్థ ఆధునాతన టైర్లను ఆవిష్కరించారు. ఎల్‌డీఎస్‌ఆర్ 500 హెవీడ్యూటీ వీల్ లోడర్ అండ్ డోజర్, ఎఫ్‌టీఎస్‌ఆర్ 300 రకాల టైర్లను ప్రదర్శించారు. యోకో హామా ఏటీజీ చీఫ్ టెక్నికల్ అధికారి ద్యుతిమాన్ ఛటోపాధ్యాయ మాట్లాడుతూ గ్యాలక్సీలో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక ఉత్పత్తులు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

మాదార చన్నయ్య ఆశయాలు సాధిద్దాం



మాదార చన్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవీంద్ర జల్దార్

రాయచూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యంత వెనుకబాటుకు గురైన మాదిగ సమాజాన్ని సామరస్యపూర్వక సమాజంగా నిర్మించేందుకు శ్రీమఠం పీఠాధిపతి మాదర చన్నయ్య స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం పని చేద్దామని శ్రీమఠం సేవాసమితి రాష్ట్ర గౌరవ సలహాదారు రవీంద్ర జల్దార్ అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మాదర చన్నయ్య సేవా సమితి జిల్లా పదాధికారుల తొలి సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలోని ఉప జాతులను సంఘటితం చేయడం ద్వారా శ్రీమఠం పీఠాధిపతి మాదర చన్నయ్య ఆశయాలను కొనసాగిద్దామన్నారు. సమితి ఏర్పడి 23 ఏళ్ల పూర్తికాగా, సమాజ హితం కోసం సమితి చేపట్టిన పలు కార్యక్రమాలు మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మాదిగ ఉప కులాలను సమాన దృష్టితో చూడడం, ఐక్యంగా ముందుకు సాగడం వంటి చన్నయ్య స్వామిజీ ఆశయాలను కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో సేవాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేఎం వీరేశ్, అత్తనూరు భీమరాయ, మంచాల భీమణ్ణ, సేవాసమితి జిల్లాధ్యక్షుడు జేఎం మౌనేశ్, భీమరాజ పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1620.49	1629.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	484	3,624
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,110	5,173
నీటి నిల్వ (టీఎంసీలు)	62.72	92.24



ఉచ్చాయాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా మహాదేవ తాత ఉత్సవం

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మెట్రి గ్రామంలో వెలిసిన విశ్వారాధ్య గురుకుల మఠం ప్రాణవాజ్యోతి మహాక్షేత్ర స్థాపకుడు లింగయ్యకు హంద్యాలమఠం మహాదేవతాత 42వ పుణ్యస్మరణోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీమఠంలో మాతృశ్రీ గౌరమ్మ, మహాదేవతాత, ప్రణవ జ్యోతి పంచ పీఠాధీశ్వర విగ్రహాలతో సహా వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం మఠం మొదలుకొని బసవన్నపేట ఎదురుగా ఉన్న బసవన్న కట్ట వరకు ఉచ్చాయంను భక్తులందరి జయజయ ధ్వానాలతో లాగారు. తిరిగి మఠం వరకు ఊరేగించారు. అనంతరం భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఉజ్జిని జగద్గురు సిద్ధలింగ శివాచార్య సాధుపస్మరణ సందర్భంగా నిర్వహించిన ప్రవచనం శుభప్రదంగా ముగిసింది. హెచ్ఎం విశ్వేశ్వరయ్య స్వామీజీ పురాణ ప్రవచనం చేశారు. సోమశేఖరయ్య స్వామి హార్మోనియంతో సీడీ మౌనేష్ తబలాతో ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ గా తరలి వచ్చారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న అడివయ్యస్వామి

సిరుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో బైలునాటకం ప్రదర్శన ఎంతో ప్రాధాన్యం వుందని జిల్లా పరిషత్ మాజీ సభ్యులు అడివయ్య స్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప తాలుకాలో బుధవారం సిరిగేరి గ్రామంలో శంభులింగేశ్వర కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సంసారం సరిగమ సాంఘిక నాటక ప్రదర్శన జరిగింది. కార్యక్రమాన్ని అడివయ్యస్వామి ప్రారంభించి మాట్లాడారు. ఈ నాటకం గ్రామప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. నేటి రోజుల్లో డ్యాన్సులపై ఆసక్తి చూపుతున్నారని ఆయన అన్నారు. గతంలో బయలు నాటకాలు, సాంఘిక నాటకాలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం కళాకారులను సన్మానించారు.

నాటకాల్లో జీవిత సత్యం

ఉపాధ్యాయుడు శశిధర్



నాటకంలో ఓ సన్నివేశం

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో నాటకాలు ప్రదర్శించడం ద్వారా జీవిత సత్యం అర్థమవుతుందని సైన్స్ ఉపాధాయుడు శశిధర్ అన్నారు. సిరుగుప్పతాలూకా నడువి గ్రామంలోని మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ఆలాప్ సంగీత ట్రస్ట్ అధ్యక్షుడు భజంత్రి రమణప్ప ఆధ్వరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిధ బృందాలు పాల్గొన్నాయి. అనంతరం విద్యార్థుల నృత్యప్రదర్శన, రంగస్థల దర్శకుడు సిరగేరి మంజునాథ్ బృందంచే సంసారంలో సా.. ని.. ద.. ప.. అనే నాటకాన్ని తిలకించిన విద్యార్థులు, గ్రామప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

వివాదాలను ప్రజలు పరిష్కరించుకోవాలి

● న్యాయాధికారి కేజీ శాంతి ● 13న జాతీయ లోక్ అదాలత్

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదాలను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి సూచించారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవల అథారిటీ ఆదేశాల మేరకు ఈ ఏడాదిలో చివరి జాతీయ లోక్ అదాలత్‌ను 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి తెలిపారు. నగరంలోని తాళూరు రోడ్డు కొత్త జిల్లా కోర్టు సముదాయంలో వీడియో ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ న్యాయ వ్యవస్థలో ఒక భాగమన్నారు. ఇరు వర్గాల పరస్పర సమోధ్యకు వేగవంతమైన న్యాయం కోసం లోక్ అదాలత్ సహాయపడుతుందన్నారు. జిల్లాలో అదాలత్ రోజున 15 బెంచీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజున పరిష్కరించగల వివిధ కేసులను రాజీ ద్వారా పరిష్కరించవచ్చన్నారు. కోర్టు ఫీజులు తిరిగి చెల్లిస్తామన్నారు. వైవాహిక, కుటుంబ, మోటారు ప్రమాదం, చెక్కుబౌన్స్, వాణిజ్య సేవా కేసులు పరిష్కరిస్తారన్నారు. వినియోగదారులు వివాదాలు డీఆర్‌టీ భాగస్వామ్యం, రవాణా ఇరత సివిల్ కేసులు సహా అన్ని కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. దీని వల్ల డబ్బుసమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో ప్రజలకు సులభంగా న్యాయం అందుతుందని అన్నారు. దీని వల్ల కోర్టులపై భారం తగ్గుతుందని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టిసారించామని అన్నారు. జిల్లాలో మొత్తం 35,533 పెండింగ్ కేసుల్లో 8,961 కేసులను శనివారం జరగనున్న లోక్ అదాలత్‌లో రాజీ కోసం గుర్తించామని చెప్పారు. వీటిలో 4,178 కేసుల్లో ఇరుపక్షాలు రాజీ ద్వారా పరిష్కరించుకోవడానికి అంగీకరించాయని చెప్పారు,



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి

జరిమానా 50శాతం తగ్గింపు

1991-92 నుంచి 2019-20 వరకు పోలీసు శాఖలోని ఈ-చలాన్‌లో నమోదైన పెండింగ్ కేసులు, రవాణా శాఖలో నమోదైన చెల్లింపు కోసం పెండింగ్‌లో ఉన్న కేసుల జరిమానా మొత్తంపై రాష్ట్ర ప్రభుత్వం 50శాతం తగ్గింపు ఇచ్చింది. ఈ తగ్గింపు సౌకర్యం 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఆ రోజు జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఈ తగ్గింపు ఇచ్చారు. ప్రజలు ఈసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవల అథారిటీ సభ్య కార్యదర్శి సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిణామాలపై అవగాహన

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలశాస్త్రంలో జరుగుతున్న సాంకేతిక పరిణామాలు, సవాళ్లపై రాష్ట్ర, కేంద్ర భూగర్భ జల శాఖల అధికారులు పరిశోధక విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యమని కేంద్ర భూగర్భజల బోర్డు ప్రాంతీయ డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. భారత ప్రభుత్వ జల్‌శక్తి మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మేనేజ్‌మెంట్(బీఐటీఎం) సివిల్ ఇంజనీరింగ్ విభాగం, బెంగళూరులోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సివిల్‌ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 'అక్విఫర్ మ్యాపింగ్ భూగర్భ జల సంబంధిత సమస్యలు, భూగర్భజల నిర్వహణ' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూగర్భజల శాస్త్రంలో జరుగుతున్న సాంకేతిక పరిణామాలు, సవాళ్లపై రాష్ట్ర, కేంద్ర భూగర్భ జల శాఖల అధికారులు, విద్యావేత్తలు, పరిశోధకులు విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. కర్ణాటకలో కేంద్ర భూగర్భ జల బోర్డు కార్యకలాపాలు అనే అంశంపై నాక్విమ్ అధ్యయనాలు అనే అంశంపై అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ డాక్టర్ దామెర అంజేయులు, రాష్ట్రంలో వాతావరణ వైవిధ్యం, నీటి మట్టం, నీటి నాణ్యత దాని ప్రభావం అనే అంశంపై డాక్టర్ ఎం.గోపీనాథ్, స్థిరమైన భూగర్భ జలాల కోసం గ్రామస్థాయిలో భూగర్భ జల వనరుల అంచనా, నిర్వహణ అనే అంశంపై డాక్టర్ దవితురాజ్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో బీఐటీఎం ప్రిన్సిపాల్ యడవల్లి బసవరాజు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ ఖేడ్, గ్రౌండువాటర్ డైరెక్టర్ జియాలజిస్ట్ బసంత్, సైంటిస్ట్ గోభినాథ్, ప్రొఫెసర్ మహ్మద్ ఖలీద్ పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జలబోర్డు డైరెక్టర్ కృష్ణమూర్తి

ధార్వాడలో కార్యకర్తల అరెస్టుకు నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగార్థుల పోరాట కమిటీ

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధార్వాడలో సాంకేతిక కారణాలపై కార్యకర్తల అరెస్టును వ్యతిరేకిస్తూ ఉద్యోగార్థుల పోరాట సమితి నిరసన వ్యక్తం చేసింది. అనంతరం జిల్లాకలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. బెళగావి శీతాకాల సమావేశాల్లో ముఖ్యమంత్రిని కలవడానికి అనుమతి కోరుతూ ఉద్యోగార్థుల హక్కులపై డిమాండ్లతో కూడిన లేఖను ప్రధాన కార్యదర్శికి అందజేసినా ప్రభుత్వం కనీస స్పందన లేకుండా, ఎటువంటి నిబద్ధత చూపకుండా ఉద్యోగార్థులను అరెస్టు చేసి రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చిందన్నారు. ప్రభుత్వం అణచివేత చర్యకు ఉద్యోగార్థులు భయపడరని, డిమండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హొస్పేట్ (ఆంధ్రజ్యోతి) ధార్వాడ ఉద్యోగార్థుల పోరాటానికి నాయకత్వం వహిస్తున్న యువజన ఉద్యమ నాయకులను పోలీసులు అరెస్టు చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏఐడీఎస్‌ఓ విద్యార్థి సంఘం హొస్పేట్‌లో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టింది. సంఘం జిల్లా సమన్వయకర్త రవికిరణ్ మాట్లాడుతూ ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా యువత పోరాటం కొనసాగుతుండగా ధార్వాడ్‌లో ఉద్యోగార్థుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన నిరసనను పోలీసులు అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని మండిపడ్డారు. ధార్వాడ సహా రాష్ట్రంలోని విద్యార్థులు, యువత ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా నిలబడి ఈ దౌర్జన్యాన్ని ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. జిల్లా సభ్యులు ఉమాదేవి, విద్యార్థులు చంద్ర, ఆకాష్, జ్ఞానేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



హొస్పేట్‌లో నిరసన తెలుపున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

మానవ హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● కలెక్టర్ కవితా ఎస్ మన్నికేరి

హొస్పేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కవితా ఎస్. మన్నికేరి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1948లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను గుర్తుచేసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా 10వ తేదీన మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. జాతి, మతం, వర్ణం, భాష, లింగం, రాజకీయ ఆలోచనలు హోదా ఏ భేదం ఉన్నా ప్రతి మనిషి సమానమే, వారి గౌరవం స్వేచ్ఛ న్యాయం భద్రత మన చేతిలోనే ఉంటందని అన్నారు. హంపి విశ్వవిద్యాలయ కన్నడ ప్రొఫెసర్ వెంకటగిరి తలవాయి మాట్లాడుతూ మానవ హక్కులు ఉల్లంఘిస్తే భారత రాజ్యాంగం మనకు లభించే శక్తివంతమైన పరిష్కార మార్గం ప్రపంచంలోనే అత్యంత పెద్ద రాజ్యాంగాన్ని మన దేశం ఎన్నుకున్నదన్నారు. ప్రతి వ్యక్తి అభివృద్ధి, రక్షణ కోసం అంబేడ్కర్ రూపొందించిన ప్రాథమిక హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వానికి పునాది అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పంచాయతీ ప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కవితా ఎస్ మన్నికేరి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్

పిల్లలకు ఉత్తమ విద్య అందించాలి

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉత్తమ విద్య అందించాలని అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ సూచించారు. బుధవారం కంప్లి తాలుకా ఎమ్మిగనూరులో శతమానం ఉత్సవ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు తాము కూడా కూర్చుని మధ్యాహ్నం భోజనాన్ని ఆరగించారు. పాఠశాలలో 400 మందిపైగా ఉన్న విద్యార్థులు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రధానోపాధ్యాయుడు సాధుజాతప్పకు సూచించారు. తహసీల్దార్ మంజునాథనాయక్, ఆర్ఐ జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోండి



పింఛన్ల పత్రాలను వృద్ధులకు అందజేస్తున్న అదనపు కలెక్టర్

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించే సదుపాయాలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ సూచించారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో రెవెన్యూ శాఖ ఈ-పాసు బుక్ మార్పులు, చేర్పులు, పింఛన్ల విషయంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ శాఖ మంత్రి ప్రజలు, రైతులకు అనుగుణంగా గ్రామాల్లోనే సమావేశాలు ఏర్పాటు చేయాలని అక్కడ వుండే సమస్యలు అక్కడే పరిష్కరించాలని ఆదేశించారన్నారు. పాసుపుస్తకాల్లో మార్పులు, చేర్పులు చేసి 150 మంది రైతులకు అందించినట్లు తెలిపారు. మరో 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. వృద్ధులకు 60 పింఛన్ల బాండ్లను అందించామన్నారు. గ్రామాల్లో ఉన్న గ్రామాల లెక్క అధికారులు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథ నాయక, జగదీష్, శేషగిరి, మహేష్ గౌడ, వెంకట రామరాజు, మహమ్మద్ రబ్, మంజునాథ పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టిన రోజు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను జిల్లా మహిళా కంగ్రెస్ కమిటీ బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు మంజుళ మాట్లాడుతూ సోనియా గాంధీకి భారతదేశ సంస్కృతి, వైవిధ్యం, ప్రజల గురించి మంచి అవగాహన ఉందన్నారు. ఆమె భారత రాజకీయాల్లో ప్రవేశించిన క్షణం నుంచి ఆమె తన విధులను భక్తి, బాధ్యత అనుకూలత స్ఫూర్తిగా నిర్వర్తిస్తున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా శాంతి, ధైర్యం, సహనంతో నాయకత్వం వహించే లక్షణం ఆమెలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి హుమయూన్ ఖాన్, షేక్ ఆపాక్ హుస్సేన్, మహిళా కార్యకర్తలు యశోధ, ఉమ్మిసాదా, విజయలక్ష్మి, గౌసియా, రజియా, భానుబేగం, విజయకుమారి, రిహాన్, మాధురి, ప్రియాంక, మున్నీ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



రైతులకు సెల్‌ఫోన్లు అప్పగించిన ఎస్ఐ శశిధర్ నాయక

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శిరిగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొన్ని రోజుల క్రితం వివిధ గ్రామాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఏడుగురు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శశిధర్ నాయక రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అప్పగించారు. గ్రామాల్లో రైతులు జాగ్రత్త వహించుకుని తమ పర్సులు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా వుంచుకోవాలని సూచించారు.

హొసూరు జోన్

నగరాన్ని కమ్మేస్తున్న పొగమంచు

హొసూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): హొసూరు ప్రాంతంలో భారీగా మంచు కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు చాలావరకు పొగమంచుతో కప్పబడుతున్నాయి. దీంతో డ్రైవర్లు హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు నడుపుతున్నారు. తమిళనాడు సరిహద్దులో ఉన్న హొసూరు నగరం సముద్రమట్టానికి 2,883 అడుగుల ఎత్తులో ఉంది, ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో తీవ్రమైన చలి ఉంటుంది. కొన్నిరోజులుగా హొసూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో ఉదయం, రాత్రి తేడాలేకుండా మంచు కురుస్తోంది. చలితీవ్రత కారణంగా ప్రజలు జలుబు, జ్వరంతో బాధపడుతున్నారు. తీవ్రమైన చలి కారణంగా తెల్లవారుఝామున వ్యాయామం చేసేవారు, పనులకు వెళ్లేవారు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 3 గంటలకే చల్లని గాలులు వీచడం ప్రారంభమై, సమయం గడిచే కొద్ది మంచు కురవడం ప్రారంభమైతుంది. మంచు గాలుల ప్రభావం ఉదయం 10 గంటల వరకు బలంగా ఉంటోంది. రోడ్లపై దట్టమైన పొగమంచు వ్యాపించి ఉండటం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



హెడ్‌లైట్ల వెలుగులో ప్రయాణం



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే, అధికారులు

రాజాజీకి ఘన నివాళులు

హొసూరు డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తొలి భారతరత్న గ్రహీత, స్వాతంత్ర్య సమరయోధుడు రాజగోపాలాచారి (రాజాజీ)కి హొసూరు సమీపాన తొరపల్లిలోని రాజాజీ స్మారక గృహంలో ఆయన 147వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం రాజాజీ చిత్రపటానికి కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టిలు రాజాజీ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంయుక్త మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించిన రాజాజీ స్మారకగృహాన్ని రూపాన్ని మార్చకుండా పునరుద్ధరించాలని ఆదేశించామన్నారు. ప్రాజెక్టు కోసం రూ.44.50 లక్షలు కేటాయించారన్నారు. రాజాజీ స్మారకగృహంలో వెదురు, పలకలను మార్చారని దీంతో కొత్త రూపాన్ని ఇచ్చిందన్నారు. త్రాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, విద్యుత్, పెయింటింగ్ వంటి పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులు 2026 జనవరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా రాజాజీ చదువుకున్న హొసూరులోని ఆర్‌వి ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాలలో రాజాజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపరగుండ్రంలో దీపోత్సవం నిర్వహించాలి

● వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తల నిరసన

హొసూరు డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై తరహాలో మధురై జిల్లా తిరుపుర గుండ్రం (తిరుప్పరకుండ్రం)లోని సుబ్రమణ్య స్వామి ఆలయంలోకూడా దీపోత్సవం నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. హొసూరు పెరియార్‌నగర్‌లోని వేల్‌మురుగన్ ఆలయంలో బుధవారం స్కంధషష్ఠి కవచం పాట పాడి 108 కొబ్బరికాయలు కొట్టారు. ఏబీవీపీ ఉత్తర తమిళనాడు జాయింట్ సెక్రటరీ విష్ణుకుమార్, భజరంగ దళ్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ నేతృత్వం వహించారు. కోర్టు ఆదేశాల ప్రకారం తిరుపురగుండ్రం కొండపై దీపం వెలిగించడానికి తమిళనాడు ప్రభుత్వం అనుమతించాలని డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.



వేల్‌మురుగన్ ఆలయం వద్ద బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు

రాళ్లు పడి నలుగురికి గాయాలు

హొసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హొసూరు సమీపంలోని శాటిలైట్ రింగ్ రోడ్డు నిర్మించడానికి రాళ్లను పేల్చి వేస్తుండగా ఇళ్లపై రాళ్లు పడి నలుగురు గాయపడ్డారు. బెంగళూరును, కర్ణాటకలోని దేవనహళ్ళి విమానాశ్రయంతో హొసూరు ద్వారా అనుసంధానించడానికి శాటిలైట్ రింగ్ రోడ్డు (ఎస్ఆర్ఆర్) నిర్మాణం జరుగుతోంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం హొసూరు సమీపంలోని పేరండపల్లిలో కార్మికులు పేలుడు పదార్థాలను ఉపయోగించి రాళ్లను పగులగొడుతున్నారు. పేలుడు తీవ్రత కారణంగా కొత్తూరు ప్రాంతంలోని ఇళ్లపై పడుతున్నాయి. 10కిపైగా రాళ్లు ఇళ్లపై పడి, ఇంటి పైకప్పు దెబ్బతినడంతో ఇంట్లోని నలుగురు గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు రాళ్లను పేల్చిన ప్రాంతానికి వెళ్లి పని చేస్తున్న కార్మికులతో వాగ్వాదానికి దిగారు. హడ్కో పోలీసులు వచ్చి వారిని శాంతింపజేసి పంపించారు. రాళ్లను పేల్చడానికి ప్రత్యామ్నాయ మార్గాలు పాటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పెద్దసంఖ్యలో గుమిగూడిన స్థానికులు